# కాంగ్రెస్‌కు జనం షాక్

- హుస్నాబాద్‌లో ప్రియాంకగాంధీ సభ అట్టర్‌ప్లాప్
- ఇందిరమ్మ మనవరాలిని జనం పట్టించుకోలే..
- ప్రియాంక ప్రసంగ సమయానికి వెనుదిరిగిన జనం..
- సభలో జనం కన్నా.. ఖాళీ కుర్చీలే ఎక్కువ దర్శనం
- ఎన్నో ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నిరాశే మిగిలే..
- గెలుపు ఆశలు వదులుకున్న కాంగ్రెస్ పార్టీ
- పొన్నం ప్రభాకర్ ఆశలు అడియాశలు



హుస్నాబాద్ కాంగ్రెస్ సభ నుంచి బయటకు వెళ్తున్న మహిళలు

సిద్దిపేట, నవంబర్ 24( నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హుస్నాబాద్ : హుస్నాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సభ అట్టర్‌ప్లాప్ అయింది. సభకు ఇలా వచ్చామా..? ఇగ పోదాం పదా అంటూ జనం ఒకరి వెంట ఒకరు అంతా తమ గ్రామాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధి మాట్లాడే సమయానికి సుమారుగా నాలుగైదు వేల మంది మాత్రమే ఉన్నారు. ఆ మందితోనే సభ మమ అని పించి వెళ్లిపోయారు. పైగా ఆమె ప్రసంగం ఎవ్వరికీ అర్థం కాక, ఉన్న వారు సైతం గుణుక్కుంటూ ఉండిపోయారు. హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ సభ అట్టర్ ప్లాప్ కావడంతో ఆ పార్టీ శ్రేణులు నిరాశ గురయ్యారు. వారం రోజులుగా ప్రియాంక సభ సక్సెస్ కోసం గ్రామాల నుంచి జనాన్ని తరలించడానికి చేసిన ప్రయత్నాలు అన్ని విఫలమయ్యాయి. సుమారుగా 30 వేలకు పైగా మందిని లక్ష్యంగా పెట్టుకొని కేవలం ఐదారు వేల మందితోనే సభ నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక జాతీయ నాయకురాలు సభ జనం లేక వెలవెల బోయింది. వేసిన కుర్చీలు దాదాపుగా 80 శాతం ఖాళీగానే దర్శనమిచ్చాయి. ప్రియాంకగాంధీ సభ అట్టర్ ప్లాప్ కావడంతో ఇగ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడం కష్టమే అని సొంత పార్టీ కార్యకర్తలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. పైగా స్థానిక అభ్యర్థి కూడా కాదు...కరీంనగర్‌లో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందా..అంటు పొన్నం ప్రభాకర్‌నుద్దేశించి మాట్లాడుకుంటున్నారు. సభ తర్వాత ఎక్కడ చూసినా ఇదే ముచ్చట వినిపించింది.

### నిరుత్సాహంలో కాంగ్రెస్ క్యాడర్...

హుస్నాబాద్‌లో ప్రియాంకగాంధీ సభ అట్టర్ ప్లాప్ కావడంలో కాంగ్రెస్ పార్టీలో నైరాశ్యం అలుముకుంది. ప్రియాంక గాంధీ సభతో పార్టీకి ఊపు వస్తుందనుకుంటే, పూర్తిగా నిండా మునిగామని తలలు పట్టుకుంటున్నారు.అనుకున్నది ఒక్కటి.. అయ్యింది ఒకటి అన్నట్లు హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకుల వంతైంది. అక్కన్నపేట రోడ్డు ఏనే సమీపంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా శుక్రవారం ప్రియాంకగాంధీ వచ్చారు. ఈ సభకోసం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జనాన్ని తరలించేందుకు పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటుచేసిన సభాస్థలిలో దాదాపు 30వేలమంది జనాన్ని సమీకరించాలని కాంగ్రెస్ నాయకులు భావించినప్పటికీ, రెండుగంటల సమయం వరకు కూడా సభాస్థలి నిండలేదు. దీనికి తోడు మూడుగంటలు దాటినా ప్రియాంకగాంధీ సభకు రాకపోవడంతో సభకు హాజరైన జనం తిరుగుముఖం పట్టడం ప్రారంభించారు. సభకు హాజరైన వారంతా ఆమె ముందే మెజార్టీ ప్రజలు వెళ్లిపోవడంతో సభాస్థలి ఖాళీగా మారింది.పలుమార్లు ప్రియాంక గాంధీ వస్తున్నారని పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రకటించినప్పటికీ జనం ఆయన మాట లెక్కచేయకుండా సభనుంచి వెళ్లిపోవడం స్పష్టంగా కనిపించింది. పైగా కొద్దిసేపు కళాకారులతో నృత్యాలు చేసినప్పటికీ సభ నుంచి జనం వెళ్లకుండా అపలేకపోయారు.సభకు ఇష్టంతో వస్తే ఎంత సమయమైనా ప్రజలు ఉంటారు. బలవంతంగా వస్తే ఇట్లానే ఉంటది అంటూ సొంత పార్టీ నేతలే బాహాటంగా అన్నారు. ప్రియాంకగాంధీ సాయంత్రం 4:20 నిమిషాలకు హెలిక్యాప్టర్‌లో హుస్నాబాద్‌కు చేరుకున్నారు. 4:23 నిమిషాలకు ఆమె సభావేదికకు చేరుకున్నారు. సభలో ఆమె మాట్లాడిన మాటలు ఎవరికీ అర్థం కాక జనం అక్కడి నుంచి వెళ్లిపోయారు. పలువురు కాంగ్రెస్ నాయకులు వద్దని వారించినా లెక్కచేయకుండా జనం వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలతోనే సభను కాంగ్రెస్ నాయకులు మమ అనిపించారు. ప్రియాంకగాంధీ ప్రసంగ సమయానికి నాలుగైదు వేల మంది మాత్రమే ఉన్నారు. సభాస్థలిలో ఖాళీ కుర్చీలు ఉండటంతో కాంగ్రెస్ నాయకులు ఒకింత ఇబ్బందిపడ్డారు. ఖాళీ కుర్చీలు ప్రియాంక గాంధీకి కనిపించకుండా కార్యకర్తలను కుర్చీలపై నిలబడమని సైగలు చేశారు. ఎంతో ఆర్భాటంగా సభను నిర్వహించి కార్యకర్తల్లో ఊపుతెద్దామని అనుకున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రయత్నం వికటించింది. అసలే స్థానిక వ్యక్తి కాకపోవడం, కాంగ్రెస్ పార్టీకి పెద్ద మైనస్, పైగా ప్రియాంక గాంధీ సభతో ఆ పార్టీ పూర్తిగా డైలమాలో పడిపోయింది. ఈ సభకు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాకూర్, సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరైన ఈ సభ పూర్తిగా ఫెయిల్ కావడంతో వారందరూ నిరాశగా వెనుదిరిగారు.



హుస్నాబాద్ కాంగ్రెస్ సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



హుస్నాబాద్ కాంగ్రెస్ సభ నుంచి బయటకు వెళ్తున్న ప్రజలు


# ముదిరాజ్‌ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

**తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్**



దండుపల్లిలో మాట్లాడుతున్న కొట్టాల యాదగిరి ముదిరాజ్

మనోహరాబాద్, నవంబర్ 24 : ముదిరాజ్‌ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. మనోహరాబాద్ మండలం దండుపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం ఆలోచించలేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. చెరువులపై హక్కులు కల్పించడంతో పాటు ఉచితంగా చేప పిల్లలు, చేపలు విక్రయించేందుకు మార్కెట్‌యార్డులు, కోల్డ్ స్టోరేజ్‌లు కట్టించారన్నారు. సంవత్సరానికి వంద కోట్లు మత్స్య శాఖ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను గజ్వేల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, సర్పంచ్ నాగభూషణం, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు, బీఆర్ఎస్ కూచారం గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి నరేశ్ ముదిరాజ్, నాయకులు పంజా భిక్షపతి ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పీటీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ శ్రేణులు

# అఖండ మెజార్టీని కట్టబెట్టాలి

మనోహరాబాద్, నవంబర్ 24 : నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేసి దేశంలోనే తెలంగాణను అగ్రగ్రామిగా నిలిపిన సీఎం కేసీఆర్‌ను గజ్వేల్ నియోజకవర్గం నుంచి అఖండ మెజార్టీతో గెలిపించుకొని మన సత్తా చాటాలని మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పీటీ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ర్యాలీగా ప్రతి గడపకూ వెళ్తు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, హామీలను వివరించారు. 60 ఏండ్లు పాలించిన బీజేపీ, కాంగ్రెస్ నేతలను మన నిధులు, నీళ్లను మళ్లించి మోసం చేశారని గుర్తు తెచ్చారు. సీఎం కేసీఆర్ హయాంలోనే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, రైతు బంధు మండల కో-ఆర్డినేటర్ యంజాల సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఉప సర్పంచ్‌లు మన్నె ధర్మేందర్, మహేందర్‌గౌడ్, రైతుబంధు గ్రామ కో-ఆర్డినేటర్ నాగిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, రమేశ్, నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జన్మదిన వేడుకలు

రేగోడ్, నవంబర్ 24 : మండల కేంద్రంలోని తెలంగాణలో మొదటి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంగా విరాజిల్లుతున్న ప్రసిద్ధి గాంచిన మఠం రేగోడ్‌లో కలదు. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అవతరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా మఠాన్ని పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకం, డోలా రోహణం, పల్లకీసేవ, హారతి, అన్నదానం, భజన, ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు ప్రతి ఏడాది నిర్వహిస్తామని ఆలయ పూజారి శివకుమార్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, భజన భక్తజన బృందం పాల్గొన్నారు.



భజన చేస్తున్న భక్త జన బృందం